క్లుప్తంగా

చిరువ్యాపారులకు తీవ్ర నష్టం



పెనుగంచిప్రోలు : మునేరు వరద ప్రవాహానికి మునేరు పక్కన నివసించేవారితోపాటు అమ్మవారి ఆలయం వద్ద చిరువ్యాపారాలు చేసుకునే వారు తీవ్రంగా నష్టపోయారు. వరద తీవ్రతను ఊహించక దుకాణాల్లోనే సరుకును ఉంచడంతో వరదకు సామగ్రి అంతా కొట్టుకుపోయింది. ఆలయం వద్ద చిరువ్యాపారులు రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు



నందిగామ టౌన్: నందిగామ పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు సోమవారం తెలిపారు. పట్టణంలోని అనాసాగరం జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, బాబు జగ్జీవన్‌రాం భవనంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం 800 మంది వరద బాధితులను తరలించినట్లు వివరించారు. ఈ కేంద్రాల్లోని ప్రజలకు తాగునీరు, భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు.

చింతలపాడు జలదిగ్బంధం

చందర్లపాడు(నందిగామ టౌన్): భారీవర్షాలకు చందర్లపాడు మండలంలోని పలు గ్రామాలు నేటికీ వరద ముంపులోనే కొనసాగుతున్నాయి. వరద నీరు తగ్గుముఖం పట్టినప్పటికీ ఇళ్లలోకి చేరిన వరద నీరు మాత్రం పూర్తిస్థాయిలో బయటకు వెళ్లకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చింతలపాడు గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలోనే ఉంది. వరద కారణంగా ఇప్పటికే 10మేకలు, ఆరు ఆవులు మత్యువాత పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రెండురోజులుగా కరెంట్ లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



నందిగామ టౌన్: వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఆదేశాలతో నందిగామ పట్టణంలోని ముంపుకు గురైన ప్రాంతాల ప్రజలకు, ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి వరదనీరు చేరటంతో నిలిచిపోయిన వాహనదారులు, ప్రయాణికులకు మంచినీరు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, బొల్లినేని శ్రీనివాసరావు, నల్లాని అయ్యన్న, నాయుడు ఉదయలక్ష్మి, చాగంటి రవికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

5.43లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

జగ్గయ్యపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి సోమవారం 5.43లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో నది పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదనీరు ఆదివారం రాత్రి రావిరాలలోకి రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వరద ఉధృతి సోమవారం తెల్లవారుజాము సమయానికి తగ్గిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అజెండాలోని అంశాలు ఆమోదం

నందిగామ టౌన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది.చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అజెండాలోని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు.

పాలేరు బ్రిడ్జి వద్ద రాకపోకలు



జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ఏపీ-తెలంగాణ సరిహద్దు గల గరికపాడు చెక్‌పోస్ట్ సమీపంలోని పాలేరు వంతెన నుంచి సోమవారం సాయంత్రం నుంచి భారీ వాహనాల మినహా బస్సులు, కార్ల రాకపోకలకు అధికారులు అనుమతించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఓ వంతెన దెబ్బతినడంతో వన్‌వే మార్గంలో రెండు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను పంపిస్తున్నారు. పాలేరు వంతెనను నేషనల్ హైవే ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపడతామని తెలిపారు. అంతకుముందు తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాలేరు బ్రిడ్జిని సందర్శించారు.



జగ్గయ్యపేట మండలం బూదవాడ ఎస్టీకాలనీని చుట్టుముట్టిన వరదనీరు



చెవిటికల్లు గ్రామస్తులను పడవల ద్వారా పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు



పెనుగంచిప్రోలు చెరువు అలుగు వద్ద కోతకు గురైన ప్రధాన రహదారి

వీడని వరద ముంపు

భారీ వర్షాలతోపాటు మునేరు, పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలు మూడు రోజులుగా వరద ముంపులోనే ఉన్నాయి. వరద ఉధృతికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, ఇళ్లలోకి వరదనీరు చేరింది. వరద బాధితులు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. వర్షాలకు వేలాది ఎకరాల పంటపొలాలు నీటమునగగా, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. గ్రామీణ రోడ్లు ధ్వంసమయ్యాయి. వాగులు ప్రమాదకరస్థితిలో పొంగిప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరు బ్రిడ్జి మరింత కోతకు గురైంది. వందలాది విద్యుత్‌స్తంభాలు నేలకూలగా, ట్రాన్స్‌ఫార్మర్లు నీటిలో మునిగిపోవడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాలు మూడురోజులుగా అంధకారంలో మగ్గుతున్నాయి. పాలేరు బ్రిడ్జి, నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద ఉధృతి తగ్గడంతో అధికారులు సాయంత్రం నుంచి విజయవాడ-హైదరాబాద్ మార్గంలో బస్సులు, కార్ల రాకపోకలకు అనుమతించారు. అప్పటివరకు హైవేపై రాకపోకలు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వేలాది మంది ప్రయాణికులు హైవేపై గంటల తరబడి వేచి ఉన్నారు. మంచినీరు, భోజన వసతి లేక అవస్థలుపడ్డారు.

– జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, కంచికచర్ల, జగ్గయ్యపేటఅర్బన్



పెనుగంచిప్రోలు వద్ద మునేరు కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



అనిగండ్లపాడు వద్ద గండివాగు



ఆస్పత్రులకు వెళ్తున్న రోగులను ఐతవరం వద్ద క్రేన్ సాయంతో హైవే దాటిస్తున్న అధికారులు



కీసరలో నీటమునిగిన వరిపొలాలు



బూదవాడ పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులు



మిట్టగూడెంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్



పేట ఆర్టీసీకాలనీలో బియ్యం పంపిణీ చేస్తున్న చైర్మన్ రాఘవేంద్ర



పెనుగంచిప్రోలు కాజ్‌వేపై చెత్త తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచి పద్మకుమారి, నాయకులు

పేదల పెన్నిధి వైఎస్సార్

నందిగామ టౌన్: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల బాగు కోసం అహర్నిశలు పని చేశారని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయం నుంచి గాంధీసెంటరు వరకు పాదయాత్రగా చేరుకుని మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదల ప్రాణాలు నిలబెట్టారని కొనియాడారు. వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్ కరిముల్లా, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బండారు వెంకట్రావ్, మంచాల చంద్రశేఖర్, నాదెండ్ల నరేంద్ర, మువ్వల శ్రీను పాల్గొన్నారు. అదేవిధంగా చందర్లపాడులో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ ఎం.నరసింహారావు, ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, సర్పంచి కస్తాల పున్నమ్మ, రాయల జానకిరామయ్య, శాఖమూరు వెంకట కుమారి, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో...

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయా కూడళ్లలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్‌చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నంబూరి రవి, తుమ్మల ప్రభాకర్, వట్టెం మనోహర్, ఆవాల భవానీప్రసాద్, పుల్లారావు, తిరుపతయ్య, శ్రీనివాసరావు, కాశి కిషోర్, నాగేంద్ర, డి.రామకృష్ణ, ఎస్.మురళి ఉన్నారు. గౌరవరం ఎస్సీకాలనీ, పోచంపల్లిలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పరమేశ్వరరావు, అప్పిరెడ్డి, రంగారెడ్డి, నర్సిరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



నందిగామలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగంచిప్రోలులో గ్రామ సర్పంచి వేల్పుల పద్మకుమారి, వేల్పుల రవికుమార్, బాడిశ పాపారావు, చేని కుమారి, కాకాని పద్మ, బెజవాడ శ్రీనివాసరావు, ముసిబోయిన సైదులు, రంగిశెట్టి దుర్గాప్రసాద్, బత్తుల వెంకటనర్సు, వూట్ల నాగేశ్వరరావు, ఎంపీటీసీ జంగం వీరమ్మ, బత్తుల రామారావు, దారా రాంబాబు, బుజ్జి, మెండెం దాసు, చింతమల రాంబాబు, జంగం కాశేశ్వరరావు, ముండ్లపాడులో వైస్ ఎంపీపీ జి.వాసు, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.



జగ్గయ్యపేటలో నివాళులర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, తన్నీరు, ప్రభాకర్ తదితరులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. పెద్దాపురంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఆవుల ప్రసాద్, జుజ్జూరులో సర్పంచి రమావత్ కోటి, షహనాజ్ బేగం, పసుపులేటి సాయిబాబు, పూలా రాంబాబు, నాగుల్‌మీరా, పుల్లయ్య, ఫయాజ్ తదితరులు వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మునేరు తువ్వకాలువకు గండ్లు

పెనుగంచిప్రోలు: మునేరును వరద ముంచెత్తడంతో తువ్వకాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. వరద నీరు మొత్తం పొలాలపై ప్రవహించింది. దీంతో పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల గుమ్మడిదూర్రు గ్రామాల మునేరు ఆయకట్టున వేసిన వరినాట్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. పత్తి, మిర్చి, అరటి తోటలు కూడా దెబ్బతిన్నాయి. మునేరు సోమవారం కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీవర్షాలకు 3,500ఎకరాల్లో వరి, పత్తి 2వేల ఎకరాలు, మిర్చి 200 ఎకరాల్లో నీట మునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏఓ కె రామసుబ్బారెడ్డి తెలిపారు. మునేరు వరద ప్రవాహానికి తువ్వకాలువకు 10చోట్లకు పైగా గండ్లు పడటంతో వరదనీరు ఆయా గ్రామాలను చుట్టుముట్టింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాగులు ఇంకా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తి స్తంభించాయి. వరద ఉధృతికి పెనుగంచిప్రోలు నుంచి నందిగామ, విజయవాడ వెళ్లే రహదారిలో పెనుగంచిప్రోలు చెరువు అలుగుల వద్ద వాగుచప్టా పూర్తిగా కొట్టుకుపోయింది. పెనుగంచిప్రోలు-అనిగండ్లపాడు, అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు, శనగపాడు-అనాసాగరం, పెనుగంచిప్రోలు-సుబ్బాయిగూడెం మధ్య వరద ప్రవాహానికి రోడ్డంతా దెబ్బతింది. రాకపోకలు నిలిచి పోయాయి.



తువ్వకాలువకు పడిన భారీ గండి

నేలకొరిగిన 200 విద్యుత్ స్తంభాలు

జగ్గయ్యపేట అర్బన్: భారీవర్షాల కారణంగా జగ్గయ్యపేట సబ్ డివిజన్ పరిధిలో పాలేరు, మునేరు వరదల కారణంగా 200 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని ఏడీఈ జె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పేట నాగమయ్య బజారులో ఒక ట్రాన్స్‌ఫార్మర్, పెనుగంచిప్రోలు మండలంలో 30 ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునిగినట్లు వివరించారు. వరదల కారణంగా విద్యుత్‌శాఖకు రూ.90లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో అన్ని గ్రామాల్లో విద్యుత్‌సరఫరా పునరుద్ధరణకు వారంరోజుల సమయం పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఏ కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కీసర మునేరు

కంచికచర్ల : భారీవర్షాలతోపాటు ఎగువన తెలంగాణ నుంచి వస్తున్న వరదతో కంచికచర్ల మండలం కీసర మున్నేటికి సోమవారం భారీగా వరదనీరు చేరింది. మున్నేటికి 1.30 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. కీసర గ్రామంలో మున్నేరు, కట్టలేరు, వైరా ఉపనదులు కలవడంతో భారీగా వరదనీరు చేరింది. మండలంలోని చెవిటికల్లు, కునికెనపాడు, మున్నలూరు, కొత్తపేట, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోకి వరదనీరు చేరింది. బాధితులను నాటు పడవల ద్వారా పునరావాస కేంద్రాలకుతరలిస్తున్నారు. గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, శౌరీ అమరవరం గ్రామాల మధ్య ఉన్న వాగులు మూడోరోజు కూడా పొంగి ప్రవహిస్తుండటతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను తహసీల్దార్ వీ జాహ్నవి, ఎంపీడీఓ శిల్ప, ఏవో బాలశంకర రావు,డీటీ షేక్ నాగుల్‌మీరా, సీఐ డి.చవాన్, ఎస్ఐలు బొనగిరి రాజు, హైమావతి పరిశీలించారు.



ఐతవరం హైవే వద్ద వరదనీటిని పరిశీలిస్తున్న నందిగామ రూరల్ సీఐ డి.చవాన్

వరదలో కొట్టుకుపోయిన ఆరు కార్లు, ఆటో

నందిగామ టౌన్: భారీవర్షాలతోపాటు వరద ఉధృతికి నందిగామ మండలంలోని కంచల గ్రామం సోమవారం కూడా వరదముంపులోనే ఉంది. ఐతవరంలోని లోతట్టుప్రాంతాలు కూడా జలమయమయ్యాయి. దీంతో పలు కుటుంబాలవారు తమ గృహాలను వీడి ఎత్తుగా ఉన్న బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లారు. నందిగామ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోకి సైతం రెండు అడుగులకు మేర వరద నీరు చేరింది. వరద ప్రవాహానికి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలలో ఆరు కార్లు, ఒక ఆటో కొట్టుకుపోయాయి. ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహం తగ్గడంతో వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు.



ఐతవరం వద్ద కొట్టుకుపోతున్న వాహనాలు

ఇబ్బందుల్లో జగ్గయ్యపేటవాసులు

జగ్గయ్యపేట: భారీవర్షాల కారణంగా మునేరు, పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టుప్రాంతాలు ఇంకా నీళ్లలోనే నానుతున్నాయి. మిట్టగూడెం, మఠం శివాలయం ప్రాంతంతోపాటు కాకానినగర్, ఆర్టీసికాలనీ, చాకలిబజారు, నాగమయ్య బజారుల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు పలు ఇబ్బందులుపడుతున్నారు. పలు ఇళ్లలో సామగ్రి ధ్వంసంకాగా, నీటి ఉధృతికి వస్తువులు కొట్టుకుపోయాయి. మిట్టగూడెం ప్రాంతంలోని ప్రతి గృహంలో రూ.లక్ష మేర ఆస్తినష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. అరలీటరు పాలప్యాకెట్ ధర రూ.60 పలుకుతోంది. పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ముక్త్యాల, అన్నవరం, జయంతిపురంవేదాద్రి, బలుసుపాడు, బూదవాడ, రెడ్డినాయకతండా, కె.అగ్రహారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.వరద ఉధృతికి పులిచింతల ప్రాజెక్టు సిబ్బంది మూడురోజులుగా అక్కడే ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. రెడ్డినాయకతండాలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోమవారం పర్యటించారు. తండాలో వరద పరిస్థితిని పరిశీలించారు. బూదవాడ లోని ఎస్సీ ఎస్టీ కాలనీల్లో వరద నీరు తగ్గకపోవడంతో గ్రామంలోని అల్ట్రాటెక్ కర్మాగారంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి పలు సేవలు అందిస్తున్నట్లు కర్మాగారం ప్రతినిధి సతీష్ తెలిపారు.

వరదలో చిక్కుకున్న విద్యుత్ ఉద్యోగులు

జగ్గయ్యపేట అర్బన్: వత్సవాయి మండలంలోని లింగాల-చిట్యాల గ్రామాల మధ్య విద్యుత్ మరమ్మతులు చేస్తూ ఐదుగురు విద్యుత్‌శాఖ ఉద్యోగులు సోమవారం ఉదయం 11గంటల సమయంలో మునేటి వరదలో చిక్కుకున్నారు.



దీంతో జగ్గయ్యపేట ఏడీఏ శ్రీనివాసరావు విషయానిఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్రరావుతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులు వెంటనే రావిలాల నుంచి పడవ, గజఈతగాళ్లను రప్పించారు. స్థానిక ఫైర్‌సిబ్బందితో కలసి వీరంతా పడవలో వెళ్లి మునేటిలో చిక్కుకున్న విద్యుత్‌శాఖ సిబ్బందిని సాయంత్రం ఐదుగంటల సమయంలో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే, ఆర్డీవో, ఫైర్‌సిబ్బందికి బాధిత విద్యుత్ ఉద్యోగులు, ఏడీఏ కృతజ్ఞతలు తెలియజేశారు.